సాక్షి
భద్రాద్రి కొత్తగూడెం

సోమవారం ׀ 22 ׀ జూలై ׀ 2024



పుస్తకాల్లేని చదువులు

అంగన్‌వాడీ కేంద్రాల్లో ఆంగ్ల మాధ్యమంలో బోధనకు గతంలో ఐదు పుస్తకాలు అందించగా ప్రస్తుతం అవి జాడలేవు. 8లో



సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలి

ఆటో, మోటార్ కార్మికుల భద్రతతో కూడిన సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలని ఇఫ్టూ నాయకులు డిమాండ్ చేశారు. 8లో

గరిష్టం / కనిష్టం
30° / 25°

వాతావరణం

జిల్లాలో సోమవారం ఆకాశం మేఘావృతమై ఉంటుంది. మధ్యాహ్నం తర్వాత పలుచోట్ల వర్షంపడే అవకాశం ఉంది.

మున్సిపల్ కమిషనర్‌తో 'సాక్షి' ఫోన్ ఇన్



ఎ.స్వామి, మున్సిపల్ కమిషనర్

పాల్వంచ : పాల్వంచ మున్సిపాలిటీ పరిధిలో సీజనల్ వ్యాధులైన డెంగీ, మలేరియా, విషజ్వరాల బారిన పడకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలు, పారిశుద్ధ్యం, పరిసరాల పరిశుభ్రతపై అవగాహన కల్పించడంతో పాటు ప్రజలు తమ సమస్యలను వివరించేలా 'సాక్షి' ఫోన్ ఇన్ నిర్వహిస్తోంది. ఈ సందర్భంగా మున్సిపాలిటీ ప్రజలు సీజనల్ వ్యాధుల నేపథ్యాన తీసుకోవాల్సిన జాగ్రత్తలను తెలుసుకోవడంతో పాటు ఓపెన్ ప్లాట్లు, ఖాళీస్థలాల్లో చెత్త నిల్వలు, డ్రెయినేజీలు, రోడ్లు సరిగ్గా లేకపోవడం తదితర సమస్యలను కమిషనర్ ఎ.స్వామి దృష్టికి తీసుకురావొచ్చు.

తేదీ : 22-07-2024, సోమవారం
సమయం : మధ్యాహ్నం 3-30 నుంచి 4-30 గంటల వరకు
ఫోన్ చేయాల్సిన నంబర్
98499 05884

ఉధృత గోదావరి



భద్రాచలంలో రెండు బ్రిడ్జీల నడుమ గోదావరి పరవళ్లు..

రెండో ప్రమాద హెచ్చరికకు చేరువలో నీటిమట్టం

- ఏపీ, ఛత్తీస్‌గఢ్, ఒడిశా రాష్ట్రాలకు రాకపోకలు బంద్
- పునరావాస శిబిరాలకు ముంపు కుటుంబాలు
- అధికారులు అప్రమత్తంగా ఉండాలి : కలెక్టర్ జితేష్ వి పాటిల్

భద్రాచలం: భద్రాచలం వద్ద గోదావరి ఉధృతంగా ప్రవహిస్తోంది. ఆదివారం ఉదయం నుంచి క్రమంగా పెరుగుతూ వచ్చిన గోదావరి సాయంత్రం 6.51 నిమిషాలకు 43 అడుగులకు చేరుకుంది. దీంతో కలెక్టర్ జితేష్ వి పాటిల్ మొదటి ప్రమాద హెచ్చరిక జారీ చేశారు. అనంతరం అదే వేగంతో నీటిమట్టం పెరుగుతూ వచ్చింది. రాత్రి 9 గంటలకు 44 అడుగులతో 9,74,666 క్యూసెక్కుల మేర నీరు ప్రవహించింది. రాత్రి 10గంటలకు 44.40 అడుగులు, 12 గంటలకు 45.01 అడుగులుగా నమోదైంది. ఇక గోదావరి నీటిమట్టం 48 అడుగులకు చేరితే రెండో ప్రమాద హెచ్చరిక, 53 అడుగులకు చేరితే మూడో ప్రమాద హెచ్చరిక జారీ చేస్తారు.

వచ్చిన నీరు వచ్చినట్లుగానే...

గోదావరికి ఎగువ భాగంలో కురుస్తున్న వర్షాలతో పాటు ఛత్తీస్‌గఢ్‌లో కురుస్తున్న వర్షాలతో తాలిపేరు ప్రాజెక్టులోకి భారీగా వరద నీరు చేరుకుంది. దీంతో వచ్చిన వరద వచ్చినట్లుగానే ఉదయం నుంచి 25 గేట్లు ఎత్తి నీటిని గోదావరిలోకి వదిలారు. ఉదయం ఇన్‌ఫ్లో 43,603 క్యూసెక్కులు ఉండగా సాయంత్రానికి 44,535 క్యూసెక్కులకు పెరిగింది. దీంతో రాత్రి 7 గంటలకు 80,305 క్యూసెక్కుల నీటిని గోదావరిలోకి విడుదల చేశారు. అదేవిధంగా చర్ల మండలంలో ఎడతెగని వర్షం కురవడంతో జిల్లాలోనే అత్యధికంగా 68.2 మి.మీ. వర్షపాతం నమోదైంది. భద్రాచలం ఆర్‌డీఓ దామోదర్‌రావు దుమ్ముగూడెం మండలంలో పునరావాస శిబిరాలను పరిశీలించి రెవెన్యూ అధికారులు, సిబ్బందికి తగు సలహాలు, సూచనలను ఇచ్చారు. చర్ల మండలం తేగడ గ్రామంలో లోతట్టు ప్రాంత కుటుంబాల వారిని పునరావాస శిబిరాలకు తరలించారు. భద్రాచలంలోని కరకట్టల వద్దనున్న స్లూయిజ్‌ల వద్ద ఏర్పాటు చేసిన మోటార్ల ద్వారా పట్టణంలోని వర్షపు నీటిని గోదావరిలోకి ఎత్తిపోస్తున్నారు. కరకట్ట, స్నానఘాట్‌ల వద్దకు భక్తులను, సందర్శకులను అనుమతించటం లేదు.

అంతా అప్రమత్తంగా ఉండాలి..

ఎడతెరపి లేకుండా కురుస్తున్న వర్షాలతో గోదావరి పెరుగుతుండడంతో లోతట్టు గ్రామాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని కలెక్టర్ జితేష్ వి పాటిల్ అన్నారు. చర్ల, దుమ్ముగూడెం, భద్రాచలం మండలాల ముంపు ప్రాంతాల ప్రజలు పునరావాస కేంద్రాలకు తరలిరావడానికి అధికారులకు సహకరించాలని కోరారు. ప్రజలు వాగులు, చెరువులు దాటే ప్రయత్నం చేయొద్దని, అత్యవసరమైతే భద్రాచలం ఐటీడీఏ, సబ్ కలెక్టరేట్‌లో ఏర్పాటు చేసిన కంట్రోల్ రూమ్‌లకు ఫోన్ చేయాలని సూచించారు. జలాశయాల వద్దకు ప్రజలు రాకుండా పటిష్ట నియంత్రణ చేపట్టాలని, వరద నిలిచిన రహదారులల్లో రవాణా నియంత్రణకు ట్రాక్టర్లు అడ్డు పెట్టాలని అధికారులను ఆదేశించారు. అనుక్షణం అధికార యంత్రాంగం సిద్ధంగా ఉండాలన్నారు.

దుమ్ముగూడెంలో..

దుమ్ముగూడెం: మండలంలో కురుస్తున్న వర్షాలతో పాటు ఎగువ ప్రాంతాల నుంచి వస్తున్న నీటితో గోదావరి ఉధృతంగా ప్రవహిస్తోంది. భద్రాచలం దగ్గర గోదావరి మొదటి ప్రమాద హెచ్చరిక దాటి ప్రవహించే అవకాశాలు ఉన్నట్లు నీటి పారుదల శాఖ అధికారులు తెలియజేయడంతో అధికార యంత్రాంగం ముంపు ప్రాంతాల ప్రజలను అప్రమత్తం చేస్తున్నారు. ఈమేరకు ఆదివారం ముంపు ప్రాంతాలను భద్రాచలం ఆర్డీఓ దామోదర్ పరిశీలించి పునరావాస కేంద్రాలను సందర్శించారు. అలాగే జిల్లా వైద్యాధికారి భాస్కర్ నాయక్, డీఐఓ బాలాజీనాయక్‌లు పర్ణశాల దగ్గర గోదావరి నదిని పరిశీలించాక ఆరోగ్యకేంద్రాన్ని సందర్శించారు. ముంపు గ్రామాల్లో ఉన్న గర్భిణులను ముందస్తుగా పీహెచ్‌సీలకు తరలించాలని, అత్యవసర మందులను అందుబాటులో ఉంచుకోవాలని, పునరావాస కేంద్రాల్లో మెడికల్ క్యాంపులు ఏర్పాటు చేయాలని ఆదేశించారు.

రాకపోకలకు అంతరాయం..

మండలంలోని సున్నంబట్టి-బైరాగులపాడు, పెద్ద నల్లబల్లి-కే లక్ష్మీపురం గ్రామాలకు రెండో రోజు ఆదివారం రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. వరద నీరు గ్రామాల రహదారిపైకి చేరడంతో రాకపోకలు నిలిచిపోయాయి. దీంతో గ్రామస్తులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.

ఏపీ, ఛత్తీస్‌గఢ్ రాష్ట్రాలకు రాకపోకలు బంద్..

గోదావరి వరద పెరగటంతో పాటు ఏపీలోని వీఆర్‌పురం, కూనవరం నడుమ ఉన్న శబరి ఉపనది పోటెత్తడంతో పలు చోట్ల ప్రధాన రహదారులపైకి గోదావరి నీరు వచ్చింది. ఏపీలోని పోలిపాక వద్ద రోడ్డుపైకి వరద నీరు రావడంతో కూనవరం, వీఆర్ పురం, చింతూరు మండలాలకు రాకపోకలు స్తంభించాయి. ఇక ఏపీలోని చట్టి వద్ద రోడ్డుపైకి గోదావరి నీరు చేరడంతో భద్రాచలం నుంచి ఒడిశా, ఛత్తీస్‌గఢ్ రాష్ట్రాలకు రాకపోకలు నిలిచిపోయాయి. దుమ్ముగూడెం, చర్ల మండలాల్లో పలు గ్రామాల నడుమ పొంగిన వాగులు అలాగే ఉండటంతో రాకపోకలు ఇంకా సాగడం లేదు.



దుమ్ముగూడెం : ఉధృతంగా ప్రవహిస్తున్న గుబ్బలమంగి వాగు

అధికారుల తీరుపై మంత్రి ఆగ్రహం



అధికారులతో సమీక్ష నిర్వహిస్తున్న మంత్రి తుమ్మల, పక్కన కలెక్టర్, ఎస్పీ

- పర్యవేక్షణ లోపం, నిర్లక్ష్యంతోనే పెద్దవాగుకు గండి
- పంట నష్టపోయిన ప్రతీ రైతుకు పరిహారం
- బాధిత కుటుంబాలకు తక్షణ సాయం చెల్లించండి
- రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల



బాధితురాలితో మాట్లాడుతున్న మంత్రి తుమ్మల

అశ్వారావుపేటరూరల్: ఇరిగేషన్ అధికారుల పర్యవేక్షణ లోపం, నిర్లక్ష్యంతోపాటు ప్రాజెక్టు గేట్లను సరిగ్గా ఆపరేట్ చేయకపోవడం వల్లే పెద్దవాగుకు గండి పడిందని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు అన్నారు. ఆదివారం ఆయన పెద్దవాగు ప్రాజెక్టును సందర్శించారు. గుమ్మడవల్లి, కొత్తూరు, నారాయణపురంలో వరదతో దెబ్బతిన్న ఇళ్లు, పంటలను పరిశీలించారు. అనంతరం పెదవాగు ప్రాజెక్టు గ్రామంలోని మహిళా డిగ్రీ కళాశాలలో అధికారులతో సమీక్షించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. పెద్దవాగు ప్రాజెక్టు గండి ఘటన బాధాకరమని, ఆస్తి, పంట నష్టం తీర్చలేనిదని అన్నారు. గండి పడడంతో తెలంగాణతో పాటు, ఏపీలోని 12 గ్రామాల్లో నష్టం వాటిల్లిందన్నారు. బుధవారం నాటికే ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటిమట్టం చేరుకోగా, ఏపీలో భారీ వర్షాలు కురుస్తున్నా ఇరిగేషన్ అధికారులు అప్రమత్తం కాలేదని మండిపడ్డారు. ఏపీ అధికారులతో సమన్వయం చేసుకొని ప్రాజెక్టు మూడు గేట్లు ఎత్తి వరదనీటిని వదిలితే ఈ దారుణం జరిగేది కాదన్నారు. ఎగువ ప్రాంతాల్లో కురుస్తున్న వర్షాలు, వరదను అంచనా వేయడంలో ఇరిగేషన్ అధికారులు విఫలమయ్యారని ఆగ్రహం వ్యక్తం చేశారు. వేసవిలోనే ప్రాజెక్టు గేట్లను ఆపరేట్ చేసి, మోటార్లు పని చేస్తున్నాయా లేదా చూసి ఉంటే ఈ పరిస్థితి వచ్చేది కాదన్నారు. 1989లో కూడా గేట్లు సక్రమంగా ఆపరేట్ కాకపోవడంతో అప్పుడు కూడా గండి పడినట్లు గుర్తు చేశారు. ప్రాజెక్టు గండిపై కలెక్టర్ పూర్తి నివేదిక ఇచ్చిన తర్వాతే చర్యలు ఉంటాయన్నారు. వరదలో చిక్కుకున్న 31 మందిని ఎస్పీ రోహిత్‌రాజ్ చాకచక్యంగా వ్యవహరించి, ఏపీ అధికారులతో సమన్వయం చేస్తూ సరైన సమయంలో హెలీకాప్టర్లను రప్పించి ప్రాణాలు కాపాడారని అన్నారు. ప్రాణనష్టం జరగకుండా చూసిన ఘనత ఎస్పీ, కలెక్టర్‌కే దక్కుతుందన్నారు. కలెక్టర్ జితేష్ వి పాటిల్ మాట్లాడుతూ.. అశ్వారావుపేటలో శాశ్వతంగా ఒక బోటు ఏర్పాటు చేస్తామని, ఈ బోటు నిర్వహణకు ఒక టీంను అందుబాటులో ఉంచుతామని చెప్పారు. కార్యక్రమంలో ఎస్పీ రోహిత్‌రాజ్, ఐటీడీఏ పీఓ రాహుల్, ఆర్డీఓ మధు, డీపీఏ చంద్రమౌళి, ట్రాన్స్‌కో ఎస్ఈ భీకంసింగ్, ఆర్అండ్‌బీ ఈఈ వెంకటేశ్వర్లు, ఇరిగేషన్ సీఈ శ్రీనివాస్ రెడ్డి, ఏడీఏ అఫ్జల్ బేగం, తహసీల్దార్ కృష్ణ ప్రసాద్, సొసైటీ చైర్మన్ నిర్మల పుల్లారావు, కాంగ్రెస్ నాయకులు బండి భాస్కర్, మొగళ్లపు చెన్నకేశవరావు, సుంకవల్లి వీరభద్రం, జ్యేష్ట సత్యనారాయణ పాల్గొన్నారు.

వరద బాధితులను ఆదుకుంటాం..

పెద్దవాగు ప్రాజెక్టు గండి కారణంగా దెబ్బతిన్న ఇళ్లు, బాధిత కుటుంబాలను ఆదుకుంటామని మంత్రి తుమ్మల తెలిపారు. పంట నష్టపోయిన ప్రతీ రైతుకు పరిహారం అందిస్తామని హామీ ఇచ్చారు. బాధిత కుటుంబాలకు తక్షణమే బియ్యం, నిత్యావసరాలు, కూరగాయలు పంపిణీ చేయాలని అధికారులను ఆదేశించారు. బురద కారణంగా ప్రభావిత గ్రామాల్లో అంటు వ్యాధులు, జ్వరాలు ప్రబలే ప్రమాదం ఉందని, తక్షణమే పారిశుద్ధ్య చర్యలు చేపట్టాలని సూచించారు. వర్షాకాలం ముగిసే వరకు అధికారులకు సెలవులు రద్దు చేశామని, నిర్లక్ష్యం చేస్తే సహించేది లేదని హెచ్చరించారు. శిథిలావస్థకు చేరిన ప్రభుత్వ, ఆశ్రమ పాఠశాలలు, హాస్టళ్లు, ప్రభుత్వ కార్యాలయాల వివరాల నివేదికను కలెక్టర్‌కు అందించి కొత్త భవనాలకు ప్రతిపాదనలు చేయాలన్నారు.

న్యూస్‌రీల్

నేత్రపర్వంగా సీతారాముల కల్యాణం



చర్ల మండలం ఆర్.కొత్తగూడెంలో స్వామివారి కల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు

చర్ల రూరల్ : శ్రీ సీతారాములకు అపర భక్తురాలైన పోకల దమ్మక్క స్మృతి యాత్ర ఉత్సవాల్లో భాగంగా భద్రాచలం శ్రీసీతారామచంద్రస్వామి వారి నిత్యకల్యాణ వేడుకను ఆదివారం చర్ల మండలం ఆర్. కొత్తగూడెంలోని శ్రీ విజయ రామ మందిరంలో నేత్రపర్వంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ ఈఓ రమాదేవి మాట్లాడుతూ.. పోకల దమ్మక్క సీతారాముల వారికి చేసిన సేవలను గుర్తుచేశారు. అనంతరం గిరిజనులకు దుస్తులు పంపిణీ చేశారు. శ్రీ రామనవమికి ఆర్.కొత్తగూడెంలో జరిగే సీతారాముల కల్యాణానికి భద్రాచలం రామాలయం నుంచి వస్త్రాలు అందజేస్తామని తెలిపారు. ధూప, దీప నైవేద్య పథకం అమలు చేయాలని స్థానికులు కోరగా అధికారుల దృష్టికి తీసుకెళ్లి మంజూరుకు ప్రయత్నిస్తామని అన్నారు.

పెద్దమ్మతల్లి ఆలయంలో చండీహోమం



స్వామివారిని తీసుకొస్తున్న అర్చకులు

పాల్వంచరూరల్ : మండల పరిధిలో కొలువుదీరిన శ్రీ పెద్దమ్మతల్లి ఆలయంలో పౌర్ణమిని పురస్కరించుకుని ఆదివారం వైభవంగా చండీహోమం నిర్వహించారు. ముందుగా మేళతాళాలు, వేద మంత్రాలతో స్వామివారిని ఊరేగింపుగా తీసుకొచ్చారు. హోమశాలలో మండపారాధన, గణపతి పూజ అనంతరం చండీహోమం, చివరన పూర్ణాహుతి గావించారు. హోమంలో పాల్గొన్న 24 మంది భక్త దంపతులకు అమ్మవారి శేషవస్త్ర ప్రసాదాలు అందజేశారు. కార్యక్రమంలో అర్చకులు, ఈఓ ఎస్.రజనీకుమారి పాల్గొన్నారు.

వైభవంగా స్మృతి యాత్ర

- దమ్మక్క చిత్రపటంతో గిరి ప్రదక్షణ, పూజలు
- ఘనంగా గోవిందరాజస్వామి కల్యాణం



దమ్మక్క విగ్రహం వద్ద అర్చకులు, అధికారులు

భద్రాచలం: భద్రగిరి క్షేత్రంలో సీతారాముల విగ్రహాలను పూజించిన ఆధ్యురాలు, రామయ్యకు అపర భక్తురాలు అయిన పోకల దమ్మక్క సేవా స్మృతి యాత్రను ఆదివారం వైభవంగా నిర్వహించారు. ఆషాఢ పౌర్ణమి రోజున భద్రాచలంలో ఈ వేడుక నిర్వహించడం 2014 నుంచి ఆనవాయితీగా వస్తోంది. మొదట ఆలయ ప్రాంగణంలోని పొగడ చెట్టు వద్దనున్న దమ్మక్క విగ్రహానికి పూజలు చేశారు. తర్వాత మేళతాళాలు, కోలాటాలు, గిరిజన సంప్రదాయ నృత్యాల నడుమ దమ్మక్క చిత్రపటంతో ఆలయ అర్చకులు, అధికారులు మిథిలా స్టేడియం వద్ద నున్న భక్త రామదాసు విగ్రహం వద్దకు, అక్కడి నుంచి టూరిజం హోటల్ వద్ద గల దమ్మక్క విగ్రహం వద్దకు వచ్చారు. ప్రత్యేక పూజలు చేసి వస్త్రాలు, పండ్లు సమర్పించారు. రామదాసు కీర్తనలు, కోలాటాలతో నగర సంకీర్తన చేశారు.

రామయ్యకు సువర్ణ పుష్పార్చన..

శ్రీ సీతారామచంద్రస్వామి వారి మూలమూర్తులకు అభిషేకం, సువర్ణ పుష్పార్చన నిర్వహించారు. తెల్లవారుజామున సుప్రభాత సేవ, సేవాకాలం, ఆరాధన తదితర పూజలు చేశారు. అనంతరం చిత్రకూట మండపంలో కొలువుదీర్చి విశ్వక్సేన పూజ, పుణ్యావాచనం చేశారు. స్వామివారికి కంకణధారణ, యజ్ఞోపవీత ధారణ, అమ్మవారికి కంకణధారణ, యోక్త్రధారణ గావించి నిత్యకల్యాణ ఘట్టాన్ని అర్చకులు శాస్త్రోక్తంగా నిర్వహించారు. కాగా, తాతగుడి సెంటర్‌లో వేంచేసియున్న గోవింద రాజ స్వామి వారి తిరుకల్యాణోత్సవం కూడా వైభవంగా నిర్వహించారు. శ్రీదేవి-భూదేవి సమేత గోవిందరాజ స్వామి వారికి దేవస్థానం తరఫున అధికారులు ముత్యాల తలంబ్రాలు, వస్త్రాలు సమర్పించారు. కల్యాణోత్సవం అనంతరం ప్రత్యేక పూజలు చేశారు.

అధికారులు అప్రమత్తంగా ఉండాలి

కలెక్టర్ జితేష్ వి పాటిల్



విస్తా కాంప్లెక్స్ వద్ద మోటార్లను పరిశీలిస్తున్న కలెక్టర్, ఎస్పీ

భద్రాచలంఅర్బన్ : భద్రాచలం వద్ద గోదావరి నీటిమట్టం పెరుగుతుండడంతో కలెక్టర్ జితేష్ వి పాటిల్, ఎస్పీ రోహిత్‌రాజ్ ఆదివారం సందర్శించారు. ఈ సందర్భంగా అధికారులతో మాట్లాడుతూ ఎగువ ప్రాంతాల్లో కురుస్తున్న వర్షాలతో గోదావరికి వరద పెరుగుతోందని, ప్రజలను అప్రమత్తం చేయాలని సూచించారు. ముంపు ప్రాంత ప్రజలకు నిత్యం అందుబాటులో ఉండాలన్నారు. ఆ తర్వాత కరకట్ట వద్ద గోదావరి వరద ఉధృతిని పరిశీలించారు. పట్టణంలోని అన్ని కాలనీల్లో పారిశుద్ధ్య చర్యలు నిరంతరం కొనసాగించాలని, సీజనల్ వ్యాధులు ప్రబలకుండా చర్యలు తీసుకోవాలని గ్రామ పంచాయతీ అధికారి శ్రీనివాస్‌ను కలెక్టర్ ఆదేశించారు. అనంతరం విస్తా కాంప్లెక్స్ వద్ద మోటార్ల పనితీరును పరిశీలించి, నిర్వహణలో ఏదైనా సమస్య ఎదురైతే సంబంధిత అధికారుల దృష్టికి తీసుకురావాలని సూచించారు. ఎస్పీ రోహిత్‌రాజ్ మాట్లాడుతూ పట్టణ పోలీసులు నిరంతరం అప్రమత్తంగా ఉండాలని, అధికారులతో సమన్వయం పాటిస్తూ ప్రజలకు ఇబ్బంది లేకుండా చూడాలని అన్నారు. కరకట్ట వద్ద భక్తులు, ప్రజలు గోదావరి వరద ఫొటోలు తీసే క్రమంలో ప్రమాదాలకు ఆస్కారం ఉందని, ఈ ప్రదేశంలో కట్టుదిట్టమైన భద్రత ఏర్పాటు చేయాలని ఆదేశించారు. కార్యక్రమంలో ఇరిగేషన్ సీఈ శ్రీనివాస్ రెడ్డి, భద్రాచలం ఏఎస్పీ అంకిత్ కుమార్, ఇరిగేషన్ ఈఈ రాంప్రసాద్, డిప్యూటీ ఈఈ మధుసూదన్ రావు, జేఈ వెంకటేష్, భద్రాచలం తహసీల్దార్ శ్రీనివాస్ పాల్గొన్నారు.

కిన్నెరసాని నాలుగు గేట్లు ఎత్తివేత



కిన్నెరసాని నుంచి దిగువకు విడుదలవుతున్న నీరు

పాల్వంచరూరల్ : ఎగువ ప్రాంతాల్లో కురుస్తున్న వర్షాలతో కిన్నెరసాని జలాశయానికి వరద ఉధృతి పెరుగుతోంది. 407 అడుగుల నీటి నిల్వ సామర్థ్యం గల ఈ రిజర్వాయర్‌లోకి 11వేల క్యూసెక్కుల ఇన్‌ఫ్లో రావడంతో ఆదివారం నాటికి నీటిమట్టం 403.30 అడుగులకు చేరింది. దీంతో ప్రాజెక్టుకు చెందిన నాలుగు గేట్లు ఎత్తి 16 వేల క్యూసెక్కుల నీటిని గోదావరిలోకి విడుదల చేసినట్లు డ్యామ్‌సైడ్ పర్యవేక్షక ఇంజనీర్ తెలిపారు. పరీవాహక ప్రాంత ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. కాగా, ప్రాజెక్టు గేట్లు ఎత్తడంతో వాగు దిగువన గల రాజాపురం, యానంబైల్ గ్రామాల మధ్య చప్టాపై వరద ఉధృతంగా ప్రవహిస్తోంది. దీంతో ఎగువన ఉన్న 24 గ్రామాలకు రాకపోకలు నిలిచిపోయాయి.

కోయ భాషను కాపాడుకోవాలి

ఐటీడీఏ పీఓ రాహుల్



మాట్లాడుతున్న పీఓ రాహుల్

భద్రాచలంటౌన్: అంతరించిపోతున్న కోయ భాషను కాపాడుకోవాల్సిన బాధ్యత ఆదివాసీ గిరిజనులపై ఉందని ఐటీడీఏ పీఓ బి.రాహుల్ అన్నారు. ఐటీడీఏ కార్యాలయంలో ఆదివారం నిర్వహించిన కోయ భాషా దినోత్సవానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. లిపిలేని కోయ భాషకు వివిధ రాష్ట్రాల అధికార భాషలను కలిపి నిఘంటువు తయారు చేసే ప్రక్రియ ప్రారంభమైందని తెలిపారు. ఆంధ్ర, తెలంగాణ, ఒడిశా, ఛత్తీస్‌గఢ్, మధ్యప్రదేశ్, మహారాష్ట్ర, ఉత్తరప్రదేశ్, కర్ణాటక రాష్ట్రాల్లో కోయ భాష మాట్లాడుతున్నప్పటికీ మాండలికాల్లో కొద్దిపాటి తేడా ఉంటుందని తెలిపారు. కోయలు మాట్లాడే భాషకు లిపి లేదని, అయినా అటవీ ప్రాంతాల్లోని కోయ తెగల వారు కోయ భాషతో పాటు తెలుగు కూడా అనర్గళంగా మాట్లాడతారని వివరించారు. తెలుగు భాష ఎక్కువగా మాట్లాడడం వల్ల కోయ భాషతో పాటు సంస్కృతి సంప్రదాయాలు అంతరించిపోయే ప్రమాదం ఉందని భావించిన ఐక్యరాజ్య సమితి 2014 జూలై 21న ఆదివాసీ కోయ భాషా దినోత్సవంగా ప్రకటించిందని, నాటి నుంచి జూలై 21వ తేదీని కోయభాష దినోత్సవంగా జరుపుకుంటున్నామని తెలిపారు. త్వరలో అన్ని పాఠశాలల్లో కోయ భాషకు సంబంధించిన విద్యను బోధించేలా ప్రయత్నాలు ప్రారంభిస్తామని తెలిపారు. అనంతరం కోయ నృత్యాలను తిలకించి, ఆదివాసీ కోయ తెగ పెద్దలను సత్కరించారు. కార్యక్రమంలో ఏపీఓ డేవిడ్ రాజ్, డీడీ మణెమ్మ, రమణయ్య, తెల్లం జోగయ్య, కోడెం భూదేవి, శ్రీరామ్ మూర్తి, బాలరాజు, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

తగ్గుతూ.. పెరుగుతూ

దోబూచులాడుతున్న తాలిపేరు



తాలిపేరు నుంచి విడుదలవుతున్న వరద నీరు

చర్ల: తాలిపేరు మధ్యతరహా ప్రాజెక్టుకు వరద దోబూచులాడుతోంది. గత పది రోజులుగా కురుస్తున్న వర్షాలతో చర్ల మండలంలోని తాలిపేరు ప్రాజెక్టుకు వరదనీరు వస్తుండగా, శనివారం భారీగా వరద పెరగడంతో 25 గేట్లను పూర్తిగా ఎత్తి 1,45,078 క్యూసెక్కుల మేర నీటిని దిగువకు విడుదల చేశారు. అర్ధరాత్రి నుంచి వరద ఉధృతి స్వల్పంగా తగ్గుతుండడంతో నీటి విడుదలను తగ్గించి ఆదివారం ఉదయం 6 గంటల వరకు 51,726 క్యూసెక్కుల చొప్పున విడుదల చేశారు. క్రమంగా ఆదివారం రాత్రి 10 గంటలకు 92,121 క్యూసెక్కులు చొప్పున వరదనీటిని దిగువకు విడుదల చేశారు. అయితే ఎగువ ప్రాంతాల్లో వర్షం కురుస్తుండడంతో సోమవారం నాటికి ప్రాజెక్టులోకి మరింతగా వరద పెరిగే అవకాశం ఉందని డీఈ తిరుపతి తెలిపారు.

పునరావాస కేంద్రానికి తరలింపు..

మండలంలోని తేగడకు చెందిన రెండు కుటుంబాల వారిని ఆదివారం రాత్రి గ్రామంలోని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో ఏర్పాటు చేసిన పునరావాస కేంద్రానికి తరలించారు. తాలిపేరు నది సమీపంలో ఉన్నందున ముందు జాగ్రత్త చర్యగా ఈ నిర్ణయం తీసుకున్నారు.

క్లుప్తంగా

మువ్వాకు పొంగులేటి అభినందనలు


మువ్వాకు పుష్పగుచ్ఛం ఇచ్చి అభినందిస్తున్న మంత్రి పొంగులేటి, ఎమ్మెల్యేలు తదితరులు

ఖమ్మంవన్‌టౌన్: రాష్ట్ర నీటిపారుదల శాఖ అభివృద్ధి చైర్మన్‌గా ఆదివారం హైదరాబాద్‌లో బాధ్యతలు స్వీకరించిన మువ్వా విజయ్ బాబును రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి అభినందించారు. ఆయనతో పాటు శుభాకాంక్షలు తెలిపినవారిలో భద్రాచలం, ఇల్లెందు, పినపాక, అశ్వారావుపేట, నకిరేకల్ ఎమ్మెల్యేలు తెల్లం వెంకట్రావు, కోరం కనకయ్య, పాయం వెంకటేశ్వర్లు, జారే ఆదినారాయణ, వేముల వీరేశంతోపాటు టీజీటీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు ఏలూరి శ్రీనివాసరావు, తుంబూరు దయాకర్‌రెడ్డి, బాలసాని లక్ష్మీనారాయణ, మేకల మల్లిబాబుయాదవ్, చింతనిప్పు కృష్ణచైతన్య తదితరులున్నారు.

ఆయుర్వేద వైద్యుడికి గౌరవ డాక్టరేట్


డాక్టరేట్ అందుకుంటున్న వీరభద్రాచారి

ఖమ్మంవైద్యవిభాగం/ఖమ్మం మామిళ్లగూడెం: ఆయుర్వేద వైద్యంలో విశిష్ట సేవలు అందించిన, ఖమ్మానికి చెందిన ఆయుర్వేద వైద్యుడు రామడుగు వీరభద్రాచారికి న్యూఢిల్లీలోని ఐకానిక్ పీస్ అవార్డు కౌన్సిల్ బాధ్యులు గౌరవ డాక్టరేట్ అందించారు. శనివారం రాత్రి న్యూఢిల్లీలోని కాన్‌స్టిట్యూషన్ క్లబ్ ఆఫ్ ఇండియా రఫీమార్గ్‌లో జరిగిన వేడుకల్లో ఈ అవార్డును టిబెటన్ పార్లమెంట్ డిప్యూటీ స్పీకర్ ఆచార్య యేషి పుంట్సోక్ వీరభద్రాచారికి డాక్టరేట్‌ను ప్రదానం చేశారు. వీడివోస్ కాలనీకి చెందిన వీరభద్రాచారి ఆయుర్వేద వైద్యుడిగా నిరుపేద, మధ్య తరగతికి చెందిన దాదాపు 430 మందికి సురక్షిత కాన్పులు చేశారు. కార్యక్రమంలో కేంద్ర మాజీ మంత్రి విజయ్ సంప్లా, రాజ్యసభ సభ్యులు నరేశ్‌బన్సల్, ఐపీఎస్ అధికారి సచిన్‌గుప్తా, మంచ్ బిష్ణు ప్రసాద్ బర్మల్, బ్రహ్మపాల్, ఐకానిక్ పీస్ అవార్డు కౌన్సిల్ చైర్ పర్సన్ సుస్మిత పాల్గొన్నారు.

ఎర్రబోడుతండా వాసికి..


భుక్యా కాశీరామ్

ఖమ్మంసహకారనగర్: ఏన్కూరు మండలం ఎర్రబోడుతండాకు చెందిన భుక్యా కాశీరామ్‌కు డాక్టరేట్ లభించింది. ఆదివారం ఆయన వివరాలు వెల్లడించారు. హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీలో ప్రొఫెసర్ ఎం.గోనానాయక్ పర్యవేక్షణలో 'అఫ్సర్, ప్రసేన్, సీతారాంల కవిత్వం –అనుశీలన'అనే అంశంపై పరిశోధన చేసి డాక్టరేట్ అందుకున్నానని తెలిపారు. కాగా, ఆయనకు స్థానికులు, ఎస్ఆర్ అండ్ బీజీఎన్ఆర్ డిగ్రీ కళాశాల అధ్యాపకులు అభినందనలు తెలిపారు.

వ్యక్తి అదృశ్యంపై కేసు

అశ్వారావుపేటరూరల్: ఓ వ్యక్తి అదృశ్యమైన ఘటనపై పోలీసులు ఆదివారం రాత్రి కేసు నమోదు చేశారు. స్థానిక ఎస్సై శివరామకృష్ణ కథనం ప్రకారం.. మండలంలోని అనంతారం గ్రామానికి చెందిన ఇస్లావత్ నరేష్, తన భార్యతో మనస్పర్థల కారణంగా ఇదే గ్రామంలోని తల్లిదండ్రుల వద్ద ఉంటున్నాడు. కాగా, శనివారం రాత్రి తన ఇంట్లో నిద్రించేందుకు వెళ్లి ఆదివారం ఉదయం నుంచి అదృశ్యమయ్యాడు. దీంతో నరేష్ తండ్రి వెంకటేశ్వరరావు లిఖిత పూర్వకంగా ఫిర్యాదు చేయగా.. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

మొబైల్ ఫోన్లు చోరీ

ఇల్లెందు: మండలంలోని బాలాజీనగర్‌కు చెందిన ఓ ఇంట్లో అర్ధరాత్రి ఓ దొంగ రెండు మొబైల్ ఫోన్లను చోరీ చేసిన సంఘటన ఇది. గ్రామానికి చెందిన తురక విజయ్ అనే వ్యక్తి ఇంట్లో శనివారం రాత్రి అంతా నిద్రిస్తున్న క్రమంలో ఓ గుర్తు తెలియని వ్యక్తి చొరబడి రెండు మొబైల్ ఫోన్లను ఎత్తుకెళ్లాడు. ఉదయం లేచి చూడగా అవి కనపడకపోవడంతో పరిసర ప్రాంతాల్లో వెతికినా ఫలితం లేకపోవడంతో చోరీ జరిగిందని గ్రహించి పోలీసులకు ఫిర్యాదు చేశారు. హెడ్‌కానిస్టేబుల్ రాజారాత్నం కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

రైలు ఢీకొని గొర్రెలు మృతి

పెనుబల్లి: మండలంలోని పార్థసారథిపురం గ్రామ శివారులోని రైల్వే అండర్ బ్రిడ్జి సమీపంలో గూడ్స్ రైలు ఢీకొని 20 గొర్రెలు మృతి చెందిన ఘటన ఆదివారం చోటుచేసుకుంది. గ్రామానికి చెందిన జోగు నానయ్యకు చెందిన గొర్రెలు అండర్ బ్రిడ్జి సమీపంలో ట్రాక్‌పై మేత మేస్తుండగా సత్తుపల్లి సింగరేణి నుంచి బొగ్గు లోడుతో కొత్తగూడెం వెళ్తున్న గూడ్స్ రైలు ఢీకొట్టింది. ఈ ఘటనలో 20 గొర్రెలు మృతి చెందాయి. సుమారు రూ.2 లక్షలు నష్టం వాటిల్లిందని నానయ్య కన్నీటి పర్యంతమయ్యాడు.

పామాయిల్ గెలలు



టన్ను ధర	రూ.13,705

పుస్తకాల్లేని చదువులు

- అంగన్‌వాడీల్లో చిన్నారులకు అందని పుస్తకాలు
- గత ఏడాది పీపీ–1,2 కిట్ల పంపిణీ
- ఈసారి ఆ ఊసెత్తని అధికారులు
- పాత పద్ధతిలోనే కొనసాగిస్తున్న వైనం
- దీంతో కాన్వెంట్ స్కూళ్లకు తరలించే యోచనలో తల్లిదండ్రులు


చిన్నారులకు పాఠాలు బోధిస్తున్న అంగన్‌వాడీ టీచర్ (ఫైల్)

భద్రాచలంఅర్బన్: అంగన్‌వాడీ కేంద్రాల్లో ఎక్కువగా పేద కుటుంబాల పిల్లలనే చేర్పిస్తారు. ఈ నేపథ్యాన మూడు నుంచి ఆరేళ్ల పిల్లలకు కేంద్రాల్లో పౌష్టికాహారం అందజేయడంతో పాటు విద్యాబుద్ధులు నేర్పిస్తున్నారు. కాగా, గత ప్రభుత్వం అంగన్‌వాడీల్లో పిల్లలకు ఆంగ్ల మాధ్యమంలో బోధన కోసం ఐదు పుస్తకాలతో కూడిన పీపీ–1, పీపీ–2 కిట్లు పంపిణీ చేసింది. వీటి ద్వారా కాన్వెంట్ స్కూళ్లను తలపించేలా ఉండడంతో ఎక్కువ మంది తల్లిదండ్రులు పిల్లలను పంపించడానికి ఆసక్తి కనబరిచారు. ఇందులోని పీపీ–1 కిట్‌లో 3 నుంచి 4 ఏళ్ల లోపు పిల్లలకు తెలుగు, ఇంగ్లిష్, మ్యాథ్స్, నేను నా పరిసరాలు, ఆర్ట్ అండ్ క్రాఫ్ట్ పాఠ్యాంశాలతో కూడిన నాలుగు పుస్తకాలు, పీపీ – 2 కిట్‌లో ఇవే అంశాలకు సంబంధించి ఐదు పుస్తకాలు ఉండేవి. అయితే, ఈ ఏడాది మాత్రం పుస్తకాల పంపిణీ జాడ లేకపోగా ఎప్పుడు వస్తాయో, అసలు వస్తాయా, రావా అన్న అంశంపై ఎవరూ స్పష్టత ఇవ్వలేకపోతున్నారు. కాగా, గతేడాది ప్రభుత్వం పంపిణీ చేసిన పుస్తకాల్లో పిల్లలకు సులభమైన రీతిలో అర్థమయ్యేలా అనేక అంశాలు ఉన్నాయని చెబుతున్నారు.

పాత పద్ధతిలోనే బోధన..

అంగన్‌వాడీ కేంద్రాల్లో పిల్లలను ఎక్కువ సంఖ్యలో చేర్పించేందుకు ప్రత్యేక కార్యక్రమాలు చేపట్టారు.


గతేడాది పంపిణీ చేసిన పీపీ–2 పుస్తకాలు

అంగన్‌వాడీ బడిబాట, అమ్మ మాట – అంగన్‌వాడీ బాట పేర్లతో రెండు విడతలుగా కార్యక్రమాలు నిర్వహించి పిల్లలను కేంద్రాలకు పంపించేలా తల్లిదండ్రులకు అవగాహన కల్పించేవారు. కానీ ఈ ఏడాది ఇప్పటివరకు పీపీ–1, 2 కిట్లు అందకపోవడంతో పిల్లలకు పాత పద్ధతిలోనే బోధిస్తున్నారు. విద్యా సంవత్సరం మొదలై నెల దాటినా ప్రభుత్వం ఇంకా పుస్తకాలు అందించలేదు. ఇప్పటికే చాలా మంది తల్లిదండ్రులు తమ పిల్లలను కాన్వెంట్లలో చేర్పించడానికి ఆసక్తి చూపుతున్నారు. ఇలాంటి తరుణంలో పిల్లలు అంగన్‌వాడీ కేంద్రాల్లో చేరేలా అవసరమైన వసతులు కల్పించాల్సి ఉన్నా.. ప్రభుత్వం ఆ దిశగా చర్యలు చేపట్టకపోవడం విమర్శలకు తావిస్తోంది.

జిల్లాలో లెక్క ఇదీ..

జిల్లాలో మొత్తం 2,060 అంగన్‌వాడీ కేంద్రాలు ఉన్నాయి. వీటి పరిధిలో ఏడు నెలల నుంచి మూడేళ్ల లోపు వయసు పిల్లలు 34,247 మంది ఉన్నారు. ఇక మూడేళ్ల నుంచి ఆరేళ్ల లోపు లోపు పిల్లలు 27,077 మంది ప్రవేశాలు పొందారు.

పీపీ కిట్లు రావాల్సి ఉంది..



జిల్లాలోని 2,060 అంగన్‌వాడీ కేంద్రాల పరిధిలోని పిల్లలకు పీపీ–1, పీపీ–2 పుస్తకాలు రావాల్సి ఉంది. వచ్చిన వెంటనే పిల్లలకు అందిస్తాం. అంగన్‌వాడీ పిల్లలకు యూనిఫామ్ కూడా అందించేలా చర్యలు తీసుకుంటున్నాం. యూనిఫామ్ పంపిణీలో కొంత జాప్యం జరిగింది. వీలైనంత త్వరగా పిల్లలకు పుస్తకాలు, యూనిఫాం అందిస్తాం.

– వేల్పుల విజేత, జిల్లా స్త్రీ, శిశు సంక్షేమశాఖ అధికారి

జోరు వానలో జలపుష్పాల వేట..!



గత మూడు రోజుల నుంచి ఎడతెరిపిలేకుండా కురుస్తున్న వర్షాలకు పలు చెరువులు జలకళను సంతరించుకొని అలుగులు పోస్తున్నాయి. ఈ క్రమంలో ఆదివారం జోరువానలోనూ పద్మాపురం బుగ్గచెరువు అలుగు వద్ద కొందరు గ్రామస్తులు ఇదిగో ఇలా జల పుష్పాల వేటలో నిమగ్నమయ్యారు. దీంతో వారు వెంట తెచ్చుకున్న సంచి చేపలతో నిండడంతో సంతోషంగా ఇంటికి వెళ్లారు. ఈ దృశ్యాలను 'సాక్షి' తన కెమెరాలో బంధించింది. – కరకగూడెం

రిజిస్ట్రేషన్ శాఖలో బదిలీలు

ఉమ్మడి జిల్లాలో 13 మంది సీనియర్ అసిస్టెంట్లకు స్థానచలనం

ఖమ్మంమయూరిసెంటర్ : స్టాంపులు, రిజిస్ట్రేషన్ శాఖలో సీనియర్, జూనియర్ అసిస్టెంట్లు, ఆఫీస్ సబార్డినేట్లు, టైపిస్ట్‌లను బదిలీ చేస్తూ ఆ శాఖ అధికారులు ఉత్తర్వులు జారీ చేశారు. ఉమ్మడి జిల్లాలో 13 మంది సీనియర్ అసిస్టెంట్లు వరంగల్ జిల్లాకు బదిలీ కాగా.. వరంగల్ జిల్లా నుంచి ఖమ్మం కు 13 మంది బదిలీపై రానున్నారు. ఖమ్మం ఆర్ఓలో పని చేస్తున్న ఎస్.కిరణ్‌కుమార్, ఎస్‌కే నజీర్, కె.కరుణ వరంగల్ ఆర్ఓకు, పి.రామ్ కుమార్ వరంగల్ డీఐజీ ఆఫీస్‌కు, ఆర్.వెంకట్‌లాల్ వరంగల్ పోర్ట్ సబ్ రిజిస్ట్రార్ ఆఫీస్‌కు, మార్కెట్ వ్యాల్యూ, ఆడిట్‌లో విధులు నిర్వర్తిస్తున్న పి.హేమలత ఏఆర్‌సీ వరంగల్‌కు, ఎస్ఆర్ఓగా కల్లూరులో విధులు నిర్వర్తిస్తున్న వి.సతీష్‌రెడ్డి వరంగల్ ఆర్ఓకు, ఖమ్మం ఆర్ఓలో విధులు నిర్వర్తిస్తున్న కె.విజయ్ వరంగల్ డీఐజీ ఆఫీస్‌కు, ఎండీ జానీపాషా వరంగల్ మార్కెట్ వ్యాల్యూ ఆడిట్‌కు, కొత్తగూడెం ఎస్ఆర్ఓలో విధులు నిర్వర్తిస్తున్న బి.రామకృష్ణ వరంగల్ ఆర్‌వోకు, వైరా ఎస్ఆర్‌వోలో విధులు నిర్వర్తిస్తున్న ఎస్‌కే ఖదీర్ వరంగల్ ఆర్‌వోకు, ఖమ్మం ఆర్‌వోలో విధులు నిర్వర్తిస్తున్న వి.ప్రశాంతి ఏఆర్‌సీ వరంగల్‌కు, కె.కిరణ్ ఆర్‌వో వరంగల్‌కు బదిలీ అయ్యారు. ఇక వరంగల్ డీఐజీ ఆఫీస్‌లో విధులు నిర్వర్తిస్తున్న వి.మురళీకృష్ణ, పి.స్వర్ణలత, వరంగల్ మార్కెట్ వ్యాల్యూ ఆడిట్‌లో విధులు నిర్వర్తిస్తున్న డి.మునేందర్, ఏఆర్‌సీ వరంగల్‌లో విధులు నిర్వర్తిస్తున్న జి.జయశ్రీ ఖమ్మం ఆర్‌వోకు, వరంగల్ ఆర్‌వోలో విధులు నిర్వర్తిస్తున్న బి.రాజేష్ ఎస్ఆర్‌వో కల్లూరుకు, కె.రాజేష్ ఆర్‌వో ఖమ్మంకు, ఎస్.భూపాల్‌కర్నా ఆర్‌వో ఖమ్మం రూరల్, కె.ఆర్.సునిల్‌కుమార్ ఎస్ఆర్‌వో మధిర, జి.రంజిత్ రాయి ఎస్ఆర్ఓ కొత్తగూడెంకు, పి.శ్రీనివాస్ ఏఆర్‌సీ ఖమ్మంకు, ఎస్ఆర్‌వో వరంగల్ పోర్ట్‌లో విధులు నిర్వర్తిస్తున్న సీ.ప్రవీణ్‌కుమార్ ఖమ్మం ఆర్‌వోకు, వరంగల్ ఆర్‌వోలో విధులు నిర్వర్తిస్తున్న ఎం.కార్తిక్ వైరా ఎస్ఆర్‌వోకు, వరంగల్ డీఐజీలో విధులు నిర్వర్తిస్తున్న కె.జ్యోతి లక్ష్మి ఖమ్మం మార్కెట్ వ్యాల్యూ అండ్ ఆడిట్‌కు బదిలీపై రానున్నారు. ఇక 31 మంది జూనియర్ అసిస్టెంట్‌లకు, 12 మంది ఆఫీస్ సబార్డినేటర్స్‌కు, 31 మందికి, ఒక టైపిస్ట్‌కు అంతర్ జిల్లాలోనే బదిలీలు జరిగాయి.

సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలి


పట్టణంలో ర్యాలీ నిర్వహిస్తున్న ఇఫ్టూ నాయకులు

ఇల్లెందు: ఆటో, మోటార్ కార్మికుల భద్రతతో కూడిన సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలని ఇఫ్టూ రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు ఐ.కృష్ణ, ఆర్.జనార్దన్ డిమాండ్ చేశారు. ఆదివారం ఓ ఫంక్షన్ హాల్‌లో ఆటో, మోటార్ వర్కర్స్ కార్మిక సంఘం(ఇఫ్టూ) 5వ మహాసభలో పాల్గొన్న వారు ప్రసంగించారు. కరోనా కాలాన్ని అడ్డుపెట్టుకుని నరేంద్రమోదీ ప్రభుత్వం కార్మిక హక్కులను కాలరాస్తూ నాలుగు లేబర్ కోడ్‌లను తీసుకొచ్చి డ్రైవర్ల జీవితాన్ని ఉరితాళ్లుగా మార్చిందన్నారు. సంక్షేమ బోర్డు లేకపోవడంతో అనేక అనారోగ్య సమస్యలకు గురై దుర్భర జీవితం అనుభవిస్తున్నారని తెలిపారు. బ్యాంకు ఫైనాన్స్, ఆర్టీఓల విచ్చలవిడి పన్నులు, ట్యాక్సీల రూపంలో డ్రైవర్లపై ఆర్థిక భారం మోపుతున్నారని, లైసెన్సుల సవరణల పేరుతో ప్రైవేట్ సంస్థలకు అప్పగించడం సరికాదన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీ మేరకు ఆటో కార్మికులకు నెలకు 12 వేల జీవన భృతి అమలు చేయాలని, కాంట్రాక్ట్ అవుట్ సోర్సింగ్ కార్మికులను పర్మినెంట్ చేయాలని కోరారు. కాగా, కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు మాట్లాడుతూ.. మోటార్ కార్మికుల సంక్షేమ బోర్డు ఏర్పాటు కోసం అసెంబ్లీలో లేవనెత్తుతానని హామీ ఇచ్చారు. అంతే కాక ఎన్డీ జిల్లా సహాయ కార్యదర్శి గౌని నాగేశ్వరరావు, ఎన్డీ ఎస్‌పీ వర్గం ఇఫ్టూ రాష్ట్ర సహాయ కార్యదర్శి ఎండీ రాసుద్దీన్ సౌహార్ద సందేశమిచ్చారు. అనంతరం పట్టణంలో కార్మిక వర్గం ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఇఫ్టూ జిల్లా ప్రధాన కార్యదర్శి కె.సారంగపాణి, రాష్ట్ర నాయకులు డి.ప్రసాద్, హెచ్.లింగా, జటంగి వెంకన్న, మోహన్ రావు, మల్లికార్జునరావు, తోడేటి నాగేశ్వరరావు, ఈ.నరేష్, నగేష్, నరాటి వెంకన్న, కొప్పుల శ్రీనివాస్, ఉప్పలయ్య, సుధాకర్, మల్లయ్య, ఎనగంటి రమేష్, అంజన్న తదితరులు పాల్గొన్నారు.

కిన్నెరసానిలో పర్యాటకుల సందడి

ఒకరోజు ఆదాయం రూ.33,735


బోటు షికారు చేస్తున్న పర్యాటకులు

పాల్వంచరూరల్: మండల పరిధిలో పర్యాటక ప్రాంతమైన కిన్నెరసానిలో ఆదివారం పర్యాటకులు సందడి చేశారు. జిల్లా నలుమూలల నుంచే కాకుండా ఇతర జిల్లాల నుంచి కూడా అధిక సంఖ్యలో తరలివచ్చారు.కిన్నెరసాని ప్రాజెక్టు గేట్లు ఎత్తివేయడంతో డ్యామ్ సమీపం నుంచి జలాశయాన్ని, నీటి విడుదలను వీక్షించారు. డ్యామ్‌పైకి వెళ్లకుండా కేటీపీఎస్ అధికారులు గేట్‌కు తాళం వేశారు. ఈ మేరకు డీర్ పార్కులోని దుప్పులను వీక్షించారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు ఆనందోత్సాహాల నడుమ గడిపారు. 664 మంది పర్యాటకులు రాకతో వైల్డ్‌లైఫ్ శాఖకు రూ.26,485 ఆదాయం లభించగా, 150 మంది బోటు షికారు చేయడం ద్వారా టూరిజం కార్పొరేషన్ సంస్థకు రూ.7,250 లభించినట్లు నిర్వాహకులు తెలిపారు.

విద్యుదాఘాతంతో ఐదు మేకలు మృతి


మృతి చెందిన మేకల వద్ద స్థానికులు

దమ్మపేట: మేతకు వెళ్లిన మేకలు విద్యుదాఘాతానికి గురై మృతి చెందిన సంఘటన మండల పరిధిలోని నాగుపల్లి గ్రామ శివారులో ఆదివారం చోటు చేసుకుంది. స్థానికుల కథనం ప్రకారం.. గ్రామానికి చెందిన రాంబాబు అనే గిరిజన రైతు తన ఐదు మేకలను గ్రామ శివారులో మేతకు తీసుకెళ్లాడు. ఈక్రమంలో విద్యుత్ స్తంభానికి ఉన్న ఎల్‌టీ లైన్ తీగ తెగిపడి ఉండగా.. వాటికి తగలడంతో విద్యుత్ ప్రసరించి మేకలు అక్కడికక్కడే మృతి చెందాయి. వీటి విలువ రూ.70,000ల వరకు ఉంటుందని బాధితుడు వాపోయాడు.

విలేకరులమంటూ బెదిరింపులు..

ఐదుగురిని అదుపులోకి తీసుకున్న టౌన్ పోలీసులు


వివరాలు వెల్లడిస్తున్న సీఐ కరుణాకర్

కొత్తగూడెంటౌన్: పట్టణంలోని సన్యాసిబస్తీలో హత్యకు గురైన దాసరి పూర్ణ ఇంటికి వచ్చి విలేకరులమని బెదిరించిన కేసులో ఐదుగురు వ్యక్తులను ఆదివారం కొత్తగూడెం వన్‌టౌన్ పోలీసులు అరెస్టు చేశారు. ఈమేరకు కొత్తగూడెం వన్‌టౌన్ పోలీస్ స్టేషన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో సీఐ ఎం.కరుణాకర్ వివరాలు వెల్లడించారు. ఈనెల 15వ తేదీన సన్యాసిబస్తీకి చెందిన దాసరి శ్రీనివాస్ అతడి భార్యను రోకలిబండతో కొట్టడంతో చికిత్స పొందుతూ హైదరాబాద్‌లో పూర్ణ మరణించింది. మరుసటి రోజు శ్రీనివాస్ అనే వ్యక్తి దాసరి కార్తీక్‌కు ఫోన్ చేసి మాట్లాడుతూ.. మీ అమ్మకు అక్రమ సంబంధం ఉందని అందుకే హత్య చేశాడని వార్త రాస్తామని బెదిరించగా, అదే రోజు ముగ్గురు వ్యక్తులు రమేష్, గణేష్,రాజేష్ ఇంటికి వెళ్లి కుమారుడు దాసరి కార్తీక్‌తో విలేకరులమని బెదిరింపులకు పాల్పడ్డారు. ఈ విషయమై అదే రోజు కార్తీక్ పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. విలేకరులమని చెప్పిన వారిలో లక్ష్మీదేవిపల్లి శ్రీనగర్‌కాలనీకు చెందిన ఏలూరి రాజేష్‌కుమార్(ప్రైవేట్ సంస్థలో ఉద్యోగి), కొత్తగూడెం బర్లిఫీట్ ఏరియాకు చెందిన దాసరి సాంబశివరావు (విలేకరి), చుంచుపల్లి హౌసింగ్‌బోర్డుకు చెందిన చాటింపు(విలేకరి), రుద్రంపూర్ మిలీనియం క్వార్టర్‌కు చెందిన మేకల రమేష్ (ఫొటోగ్రాఫర్), కొత్తగూడెం మేదరబస్తీకి చెందిన హోటల్‌లో టీ మాస్టర్‌గా చేస్తున్న బాదావత్ గణేష్‌లను అరెస్టు చేసినట్లు సీఐ తెలిపారు. ఈ సమావేశంలో ఎస్సై విజయ, సిబ్బంది రాందాస్, ప్రసాద్‌లు పాల్గొన్నారు.

వైద్యుల నిర్లక్ష్యంతో వ్యక్తి మృతి..

ఆస్పత్రి ఎదుట బంధువుల ఆందోళన

ఖమ్మంవైద్యవిభాగం: వైద్యులు నిర్లక్ష్యంగా వ్యవహరించడంతో ఓ వ్యక్తి చికిత్స పొందుతూ మృతి చెందిన ఘటన ఆదివారం నగరంలో చోటుచేసుకుంది. దీంతో మృతుడి బంధువులు ఆస్పత్రి ఎదుట ఆందోళన చేపట్టారు. కామేపల్లి మండలం బర్లగూడెం గ్రామానికి చెందిన బానోత్ శంకర్‌నాయక్‌కు జ్వరం రావడంతో బంధువులు శనివారం శివశంకర్ థియేటర్ ప్రాంతంలోని ఆరోగ్య కేన్సర్ ఇనిస్టిట్యూట్‌లో చేర్పించారు. చికిత్స పొందుతూ ఆదివారం ఉదయం మృతి చెందటంతో బంధువులు పెద్దఎత్తున ఆస్పత్రి వద్దకు చేరుకొని ఆందోళన చేపట్టారు. సరైన వైద్యం అందించకపోవటం వల్లే మృతి చెందాడని కుటుంబ సభ్యులు, బంధువులు స్పష్టం చేశారు. రాత్రి నుంచి ఉదయం వరకు వైద్యం అందిస్తున్నామని చెప్పి లోపలికి వెళ్లనివ్వకుండా చేశారని వాపోయారు. చివరికి మృతదేహాన్ని కూడా చూడనివ్వకుండా అడ్డుకున్నారని, తమకు న్యాయం చేయాలని నినాదాలు చేశారు. ఆస్పత్రి యాజమాన్యాన్ని ప్రశ్నించినందుకు తమపై గూండాలను పురమాయించారని, మృతికి కారణమైన ఆస్పత్రి యాజమాన్యంపై కఠిన చర్యలు తీసుకోవాలని వారు డిమాండ్‌చేశారు. పరిస్థితి ఉద్రిక్తంగా మారటంతో వన్‌టౌన్ పోలీసులు అక్కడకు చేరుకొని పరిస్థితిని చక్కదిద్దారు. చివరికి ఆస్పత్రి యాజమాన్యంతో మృతుడి బంధువులు చర్చలు జరిపారు.

చేపల వేటకు వెళ్లిన వ్యక్తి గల్లంతు


నాగేశ్వరరావు (ఫైల్)


గాలింపు చర్యలను పర్యవేక్షిస్తున్న ఆర్డీఓ, ఎస్సై

పినపాక: చేపల వేటకు వెళ్లి వాగు వరద ఉధృతికి వ్యక్తి గల్లంతైన ఘటన మండల పరిధిలోనే పోట్లపల్లి పంచాయతీలో ఆదివారం చోటు చేసుకుంది. స్థానికులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన బడే నాగరాజు, పాయం నాగేశ్వరరావు ఇద్దరు పొట్లపల్లి చెక్ డ్యాం వద్ద చేపల వేటకు వెళ్లారు. చేపలు పడుతున్న క్రమంలో వాగు ఉధృతి ఒక్కసారిగా పెరగడంతో నాగరాజు సురక్షితంగా ఒడ్డుకు చేరుకోగా నాగేశ్వరరావు ఉధృతికి గల్లంతయ్యాడు. గమనించిన స్థానికులు, ఈతగాళ్లు గాలింపు చర్యలు చేపట్టారు. విషయం తెలుసుకున్న ఆర్డీఓ దామోదర్‌రావు, ఎస్సై రాజ్‌కుమార్ ఘటనా స్థలానికి చేరుకుని పర్యవేక్షించారు. సాయంత్రం కావడంతో గాలింపు చర్యలు నిలిపివేశామని, మరలా నేడు(సోమవారం) నిర్వహిస్తారని ఎస్సై చెప్పారు. చెక్ డ్యాం సమీపాన భద్రత ఏర్పాటు చేయాలని, ఎవరూ అటువైపు రాకుండా చర్యలు తీసుకోవాలని పోలీసులను ఆదేశించారు.

ఆటోను ఢీకొట్టిన కారు

ఇద్దరు మృతి, నలుగురికి తీవ్ర గాయాలు


వెంకటరత్నం (ఫైల్)


హైమావతి (ఫైల్)

చింతకాని: మండలంలోని జగన్నాథపురం సమీపంలో ఖమ్మం – బోనకల్ ప్రధాన రహదారిపై ఆదివారం ఆటోను కారు ఢీకొట్టిన ఘటనలో ఇద్దరు మృతిచెందారు. నలుగురు గాయపడ్డారు. పోలీసుల కథనం ప్రకారం.. ఏపీలోని ఎన్టీఆర్ జిల్లా వత్సవాయి మండలం కన్నెవీడు గ్రామానికి చెందిన కరిసె సుజాత అనారోగ్యంతో బాధపడుతోంది. దీంతో ఆమెను భర్త కరిసె వెంకటరత్నం (50), ఆయన అక్క చావాల శాంతమ్మ మూడు రోజుల కిందట ఖమ్మంలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తీసుకొచ్చారు. ఆమెకు ఆపరేషన్ చేయగా చూసేందుకు సూర్యాపేట జిల్లా కోదాడ మండలం కాపుగల్లు గ్రామానికి చెందిన సుజాత తమ్ముడు చెరుకుపల్లి రాంబాబు, ఆయన భార్య చెరుకుపల్లి హైమావతి (45) ఆస్పత్రికి వచ్చారు. సుజాతను డిశ్చార్జ్ చేయటంతో అందరూ కలిసి కన్నెవీడు గ్రామానికి వచ్చేందుకు ఖమ్మంలో ఆటో కిరాయికి మాట్లాడుకుని బయలుదేరారు. వీరు ప్రయాణిస్తున్న ఆటో చింతకాని మండలం జగన్నాథపురం గ్రామ సమీపంలోకి రాగానే బోనకల్ వైపు నుంచి ఖమ్మం వైపు వేగంగా వస్తున్న కారు ఢీకొట్టింది. ఆటో రోడ్డు పక్కకు ఎగిరిపడగా కరిసె వెంకటరత్నం అక్కడికక్కడే మృతి చెందాడు. తీవ్రంగా గాయపడిన చెరుకుపల్లి హైమావతి, రాంబాబు, చావల శాంతమ్మ, ఆటోడ్రైవర్‌ను 108 వాహనంలో ఖమ్మం ప్రభుత్వాస్పత్రికి తరలిస్తుండగా మార్గమధ్యలో హైమావతి మృతి చెందింది. రాంబాబు, శాంతమ్మ, సుజాతతో పాటుగా ఇల్లెందు పట్టణానికి చెందిన ఆటోడ్రైవర్ సిరాజ్‌కు తీవ్ర గాయాలయ్యాయి. కారు సమాచారం అందుకున్న ఎస్ఐ నాగుల్‌మీరా అక్కడికి చేరుకుని క్షతగాత్రులను ఖమ్మం ప్రభుత్వాస్పత్రికి తరలించారు. ఘటనాస్థలాన్ని వైరా సీఐ సాగర్ పరిశీలించారు. మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం ఖమ్మం ప్రభుత్వాస్పత్రికి తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. మృతుడు వెంకటరత్నం కన్నెవీడు సొసైటీలో గుమస్తాగా పనిచేస్తున్నాడు. ఆయనకు ఇద్దరు కుమారులున్నారు.

5 లక్షల టన్నుల బొగ్గు ఉత్పత్తికి అంతరాయం



సింగరేణి(కొత్తగూడెం): గత ఆరు రోజులు సింగరేణి వ్యాప్తంగా కురుస్తున్న వర్షాలతో సుమారు ఐదు లక్షల టన్నుల బొగ్గు ఉత్పత్తికి అంతరాయం వాటిల్లింది. మొత్తం 11 ఏరియాల్లో రోజుకు రెండు లక్షల టన్నుల లక్ష్యానికి గాను 1.10 లక్షల టన్నుల ఉత్పత్తి మాత్రమే జరుగుతోంది. దీంతో ఆరు రోజుల్లో సుమారు 5 లక్షల టన్నుల ఉత్పత్తికి విఘాతం ఏర్పడింది. కొత్తగూడెంలో ఆరు రోజుల్లో 78 వేలు, ఇల్లెందులో 30, మణుగూరు ఏరియాలో 45 వేల టన్నుల మేర బొగ్గు ఉత్పత్తికి విఘాతం కలిగింది. అయితే అన్ని ఏరియాల్లో ఇంకా ఎక్కువ నష్టం వాటిల్లినా యాజమాన్యం యాడ్ కోల్‌ను ఉత్పత్తి చూపించడంతో కొంతమేర రికవరీ అవుతోంది. సింగరేణి వ్యాప్తంగా ఉన్న 18 ఓసీల్లో రోజుకు సుమారు 15 లక్షల క్యూబిక్ మీటర్ల ఓబీ వెలికితీయాల్సి ఉండగా, ఈ ఆరు రోజుల్లో 60 లక్షల క్యూబిక్ మీటర్ల ఓబీకి అంతరాయం వాటిల్లింది.

తొమ్మిది మంది పేకాటరాయుళ్ల అరెస్ట్

దుమ్ముగూడెం: మండలంలోని పర్ణశాల గ్రామంలో ఓ ఇంటిలో పేకాట ఆడుతున్నారనే విశ్వసనీయ సమాచారం మేరకు ఆదివారం సాయంత్రం సీఐ అశోక్, ఎస్సై వెంకటప్పయ్యలు పేకాట స్థావరంపై దాడి చేశారు. దీంతో తొమ్మిది మంది పేకాట రాయుళ్లను అదుపులోకి తీసుకొని, వారి వద్ద నుంచి రూ.49,902 నగదును స్వాధీనం చేసుకున్నారు. అనంతరం వారిని స్టేషన్‌కు తరలించి కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

కోదాడలో చిక్కిన పాల్వంచ దొంగ?

పాల్వంచ: పాల్వంచ పోలీస్ స్టేషన్ పరిధిలోని పలు ఇళ్లలో చోరీలకు పాల్పడిన దొంగ సూర్యాపేట జిల్లా కోదాడలో పోలీసులకు చిక్కాడు. వివరాలిలా ఉన్నాయి. గుండాల మండలం మామకన్ను గ్రామానికి చెందిన సయ్యద్ అల్తాఫ్ తన చిన్నతనంలోనే తల్లిదండ్రులను కోల్పోవడంతో విలాసాలకు అలవాటు పడ్డాడు. చేతిలో డబ్బులు లేకపోవడంతో దొంగతనాలను అలవాటు పడి గతంలో జైలుకూ వెళ్లి వచ్చాడు. అయితే కోదాడలోని గోల్డ్ షాపు బజార్‌లో పోలీసులు వాహన తనిఖీలు చేపట్టగా.. అక్కడ అనుమానాస్పదంగా ఉన్న అల్తాఫ్‌ను పట్టుకుని విచారించారు. దీంతో అతడు కోదాడలోని పలు కేసులతో పాటు పాల్వంచలోని ఆరు ఇళ్లలో చోరీలకు పాల్పడినట్లు తేలింది. అతడి వద్ద నుంచి పాల్వంచ కేసుల్లో సుమారు రూ.8.35లక్షల విలువ చేసే ఒక కేజీ 400 గ్రాముల వెండి వస్తువులను స్వాధీనం చేసుకున్నట్లు తెలిసింది.

రోడ్డు ప్రమాదంలో యువకుడి మృతి

ముదిగొండ: రోడ్డు ప్రమాదంలో ఓ యువకుడు మృతిచెందిన ఘటన మండలంలో ని వనంవారికిష్టాపురం సమీపంలో ఆదివారం చోటుచేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం.. ముత్తారం గ్రామానికి చెందిన నారపొంగు సింహాద్రి (20) ద్విచక్రవాహనంపై ఖమ్మం నుంచి సొంత గ్రామానికి వెళ్తున్నాడు. మార్గమధ్యలో వనంవారికిష్టాపురం సమీపానికి రాగానే పణితి ప్రేమ్‌కుమార్ అతివేగంగా, నిర్లక్ష్యంగా డోజర్ నడుపుతూ వచ్చి ద్విచక్రవాహనాన్ని ఢీకొట్టాడు. తీవ్రంగా గాయపడిన సింహాద్రిని ఖమ్మం ప్రభుత్వ ఆస్పత్రికి తరలించగా మృతిచెందాడు. మృతుడి సోదరుడు వాసు ఫిర్యాదు మేరకు ఎస్ఐ నరేశ్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.